జోరుగా ఎర్రమట్టి దందా!



అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు	యథేచ్ఛగా రాత్రిపూట పనులు నిర్వహణ	అక్రమంగా టిప్పర్లలో తరలింపు	పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ అధికారులు

షాబాద్‌: ప్రభుత్వ భూముల్లో నుంచి అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఈ దందాను యథేచ్ఛగా కొందరు అక్రమార్కులు కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మైనింగ్‌ అనుమతులు లేకుండా ఎర్రమట్టిని రాత్రివేళల్లో టిప్పర్లలో నింపుకొని అమ్ముకుంటున్నారు. దీంతో రూ. లక్షల్లో అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు గానీ, పోలీసులుగానీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. షాబాద్‌ మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో వారం రోజులుగా పాఠశాల పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. షాబాద్‌ మండలంలోని నరెడ్లగూడ, హైతాబాద్‌, పెద్దవేడు, సోలీపేట్‌, తాళ్లపల్లి, లక్ష్మరావుగూడ, మక్తగూడ పలు గ్రామాల్లో నుంచి ఎర్రమట్టి రవాణా అక్రమంగా సాగుతుంది. ఆయా గ్రామాల పరిధిలోని పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు మట్టి రవాణా జరుగుతున్నా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని స్థానికులు గ్రామస్తులు వాపోతున్నారు. దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న చందంగా ఈ తంతు మారింది. షాబాద్‌ మండలంలోనే కాకుండా చుట్టు పక్కల మండలాల్లో కూడా వ్యాపారులు టిప్పర్లలో, ట్రాక్టర్లలో ఎర్రమట్టిని రవాణా చేస్తున్నారు. ప్రతిరోజూ ఇలా అక్రమంగా మట్టిని తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. అక్రమ రవాణా చేస్తున్న ఎర్ర మట్టిని కట్టడిచేసేందుకు ఈ బాధ్యతను పోలీస్‌శాఖ, రెవెన్యూశాఖకు అప్పగించారు. ఐనప్పటికీ ఈ విషయాన్ని చూసిచూడనట్లుగా వ్యవహరించడంతోనే ఈ దందాకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. ఈ విషయంలో కొందరు పోలీసులు మామూళ్లు తీసుకుని వదిలిపెడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఈ విషయంపై ఉన్నతస్థాయి అధికారులు, మైనింగ్‌ శాఖ అధికారులు, మండల అధికారులు వెంటనే స్పందించి ఎర్ర మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.



రేగడిదోస్వాడలో టిప్పర్లలోనింపి ఎర్ర మట్టి తరలింపు

కఠిన చర్యలు తీసుకుంటాం..



ప్రభుత్వ భూముల్లో నుంచి అక్రమంగా ఎర్ర మట్టిని రవాణా చేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై నిఘా ఉంచి, వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తాం. మండలంలోని ఏ గ్రామంలోనైనా మట్టిని అక్రమ రవాణా చేస్తే వారిని పట్టుకుంటాం. అవసరమైతే టిప్పర్లను, ట్రాక్టర్లను సీజ్‌ చేసి వ్యాపారులపై చట్టపర చర్యలు చేపడుతాం.

\- చిన్న అప్పలనాయుడు, తహసీల్దార్‌, షాబాద్‌

క్లుప్తంగా

శ్రీరాముడి ఆలయ నిర్మాణం చారిత్రాత్మకం

● సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ దారెడ్డి వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌ రూరల్‌: భారత దేశంలోనే అయోధ్య రాముడి ఆలయ నిర్మాణం చారిత్రాత్మకమని సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి శ్రీరాముడి శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో దారెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాముడు అందరి వాడని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌: రాష్ట్ర మంత్రి కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం షాద్‌నగర్‌ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు.

నేడు కాంగ్రెస్‌ విస్తృత స్థాయి సమావేశం

షాద్‌నగర్‌: పట్టణ శివారులో బైపాస్‌ రోడ్డులోని కుంట్ల రాంరెడ్డిగార్డెన్‌ ఫంక్షన్‌ హాల్‌లో బుధవారం ఉదయం 10గంటలకు కాంగ్రెస్‌ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ తెలిపారు. ఈ సమావేశానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డితో పాటు, మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ పరిధిలోని ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్‌: మొయినాబాద్‌, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని పెద్దమంగళారం, చిన్నషాపూర్‌, అప్పారెడ్డిగూడ, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి గ్రామాల పరిధిలో బుధవారం విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈలు బానోతు హమునాయక్‌, రాజేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమంగళారం ఫీడర్‌ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, నక్కలపల్లి ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు, చిన్నషాపూర్‌, అప్పారెడ్డిగూడ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని వారు తెలిపారు. ఈ విషయంలో ఆయా గ్రామాల్లోని రైతులు, విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ప్రతీ పేదోడికి సంక్షేమ ఫలాలు

● చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్‌



మాట్లాడుతున్న భీంభరత్‌

శంకర్‌పల్లి: ప్రతీ పేదోడికి సంక్షేమ ఫలాలు చేరవేయడమే కాంగ్రెస్‌ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ అన్నారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్‌ కార్యాలయంలో మంగళవారం మండల నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారంటీల పథకాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తోందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్‌ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ సత్తా చాటే విధంగా భారీ మోజార్టీ అందించేందుకు కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్‌ చింపుల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి 9వ తరగతి అడ్మిషన్లు ప్రారంభం

షాబాద్‌: 5 నుంచి 9వ తరగతికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలంగాణ మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శ్రీవాచ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీలు

షాద్‌నగర్‌: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రీసోర్సు పర్సన్‌లు మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. గత సంవత్సరం జూన్‌ నుంచి డిసెంబర్‌ వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ నెలకు రూ.20వేల గౌరవవేతనాన్ని ఇప్పించాలని, ఆర్‌పీలకు డ్రస్‌ కోడ్‌ను అమలు చేయాలని, రూ. 10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్లు ఆర్పీలు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో భవానీ, మాధురి, సునీత, షాజీదా, శ్వేత, అరుణ, స్వప్న, కిరణ్మయి, ప్రమీల, అనురాధ, సుజాత, వినోద, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్‌: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ సలహాదారులుగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డి, మల్లురవి, అర్క గోపాల్‌లను వేరువేరుగా వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్‌ పనిచేస్తోందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చేగూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

నందిగామ: మండల పరిధిలోని చేగూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఆ పాఠశాలలో 2003-2004 బ్యాచ్‌ పదోతరగతి చదివిన విద్యార్థులు 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక్కరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారు చిన్న నాటి చిలిపి చేష్టలు, తీపి జ్ఞాపకాలను వారు స్మరించుకున్నారు. పాఠాలు చెప్పిన తమ ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానం చేసినట్లు చెప్పారు.



చేవెళ్ల: విద్యార్థులకు షూ పంపిణీ చేసిన స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు

పోరాట యోధుడు నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌

యువతరానికి నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ స్ఫూర్తిదాయకమని పలువురు నేతలు కొనియాడారు. మంగళవారం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



మొయినాబాద్‌: నివాళులర్పిస్తున్న సర్పంచ్‌ నరోత్తంరెడ్డి



షాద్‌నగర్‌లో మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్‌

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ కాంచనలత



ఫుడ్‌ పెస్టివల్‌లో అధ్యాపకులు, విద్యార్థులు

చేవెళ్ల: విద్యార్థులు చదువుతో పాటు వ్యాపార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ కాంచనలత అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కామర్స్‌ డిపార్ట్‌మెంట్‌, ఈడీపీ కాల్‌ ఆధ్వర్యంలో వ్యాపార నైపుణ్య అభివృద్ధి పెంపొందించేందుకు ఫుడ్‌ పెస్టివల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, తినుబండారాలు తయారు చేసి ప్రదర్శనలో విక్రయించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈడీపీ కాల్‌ కన్వీనర్‌ ఆర్‌ వైష్ణవి, అధ్యాపకులు అనురాధ, రూప్నారవీంద్రన్‌, జ్యోతి, షేక్‌ మహబూబ్‌, రవీందర్‌, రాగిణి, స్వర్ణలత, సతీష్‌, వెంకటేశ్‌, వెంకటలక్ష్మీ, శకుంతల, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య



స్లాబ్‌ పనులు ప్రారంభించిన చెన్నయ్య

షాబాద్‌: మైనార్టీ సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మిద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మైనార్టీ అధ్యక్షుడు అశ్వక్‌అలీలు పేర్కొన్నారు. షాబాద్‌ మండలంలోని మిద్దెంగూడ గ్రామంలో మంగళవారం దర్గావద్ద స్లాబ్‌ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సముచితమైన న్యాయం జరుగుతుందన్నారు. మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్‌ ఎల్లవేళల కృషి చేస్తుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ వెంకయ్య, భూపతిరాజు, పాపిరెడ్డి, పురుషోత్తం, అక్బర్‌, హుస్సేన్‌ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

అంగన్‌వాడీ టీచర్ల ప్రధాన కార్యదర్శి కవిత



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మొయినాబాద్‌ రూరల్‌: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల అంగన్‌వాడీ టీచర్ల ప్రధాన కార్యదర్శి కవిత పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్‌ పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావోలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని అంగన్‌వాడీ టీచర్లు కవిత, లక్ష్మిలు మాట్లాడుతూ కిషోర బాలికలు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిరోజూ తాజా ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. దీంతో కిషోర బాలికల్లో పెరుగుదల ఎక్కువగా ఉంటుందన్నారు. టీనేజ్‌ దశలో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి’



కొందుర్గు: బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌



మొయినాబాద్‌ రూరల్‌: క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభిస్తున్న దారెడ్డి వెంకట్‌రెడ్డి

కొందుర్గు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ముట్పూర్‌ హెచ్‌ఎం చెన్నారెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ముట్పూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారన్నారు.

గెలుపోటములు సర్వసాధారణం..

క్రీడల్లో గెలుపోటములు సర్వ సాధారణమేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. వారం రోజులుగా కొందుర్గు మండల కేంద్రంలో కొనసాగుతున్న కేపీఎల్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ మంగళవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి అంజయ్యయాదవ్‌ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌ రెడ్డి, జగదీశ్వర్‌ గౌడ్‌, రవీందర్‌ రెడ్డి, దర్గ రామచంద్రయ్య, ఖలీమ్‌, శ్రీశైలం, పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్‌: క్రీడకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడుతాయని మాంటిస్సోరి పాఠశాల సీఈఓ జార్జ్‌ థామస్‌ పేర్కొన్నారు. రెండు రోజులుగా షాబాద్‌ పీఆర్‌ఆర్‌ స్టేడియంలో మాంటిస్సోరి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకధారుఢ్యం పెరుగుతుందని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్‌ మహేశ్‌యాదవ్‌, ప్రిన్సిపాల్‌ సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు పోనమోని రవేష్‌యాదవ్‌, మల్లేష్‌యాదవ్‌, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌ రూరల్‌లో..

మొయినాబాద్‌ రూరల్‌: శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభా వెంకట్‌రెడ్డి అన్నారు. కేతిరెడ్డిపల్లి గ్రామంలో మండల స్థాయి క్రికెట్‌ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సహజంగా తీసుకోని స్నేహ భావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ సిద్ధయ్య, గ్రామ యువకులు ప్రశాంత్‌రెడ్డి, వంశీరెడ్డి, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

మండల విద్యాధికారి అక్బర్‌



మొయినాబాద్‌ రూరల్‌: ఎస్‌టీఎఫ్‌ క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న నక్షత్రంజేవంతు, సంతోష్‌కుమార్‌

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి అక్బర్‌ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్‌ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం టీయుటీఎఫ్‌ చేవెళ్ల శాఖ క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్‌పాషాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే జమ చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానందం, శివానందం, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా కార్యదర్శి అంజయ్య, మెగులయ్య, మండల గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌ రూరల్‌:

మొయినాబాద్‌ రూరల్‌: విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని, వారి భవిష్యత్‌ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని ఎంపీపీ నక్షత్రంజేవంతు, ఎస్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు యూపోచయ్యలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట ఎస్‌టీఎఫ్‌ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన చేసి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ గౌతమ్‌కుమార్‌, ఎంపీడీవో సంధ్య, జిల్లా కార్యదర్శి గోపాల్‌, మండల అధ్యక్షుడు జి శ్రీనివాస్‌గౌడ్‌, కార్యదర్శి పగడాల సుధాకర్‌, హెచ్‌ఎం నర్సింహ్మానాయక్‌, ఉపాధ్యాయులు శోభారాణి, సంతోషి, స్వప్న, రాంచందర్‌, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.